తిప్పు బడుతూండగా 'ఆపాపు' అంటారు. ఇంకొందరు కొలిమిలోని వేడిని తట్టుకోలేక 'ఇంకొద్దు. నన్ను బయటకి తీసెయ్' అని రోదిస్తారు. మరి కొందరు బ్రష్‌తో పెయింట్ చేస్తున్నప్పుడో లేదా రంగులు స్థిరంగా ఉండటానికి రెండోసారి కొలిమిలో పెట్టినప్పుడో 'ఒద్దు' అని ఏడుస్తారు. అయితే ప్రతీసారి దేవుడు 'అప్పుడే కాదు' అని మనతో అంటాడు.

ఎందుకంటే, మట్టిలా ఉన్న మనల్ని చూసినప్పుడే మనని ఎలా తీర్చి దిద్దాలో ఆయనకి ఓ అవగాహన కలుగుతుంది. మనుషులకి కలిగే కష్టాలు, నష్టాలు, కన్నీళ్ళు, బాధలు మొదలైనవన్నీ దేవుడు మనిషిని పశుత్వం నించి దైవత్వం వైపు తీసుకుపోవడానికి చేసే ప్రయత్నాల్లో భాగాలే. అవన్నీ ఆయన ప్రేమ తాలూకు కానుకలే తప్ప మరోటి, ఇంకోటి కావు.

అందుకే జ్ఞానులు, 'పూర్వ జన్మలో ఎవరికో, ఏదో చేసి ఉంటాను. ఆ పాప ఫలితంగానే నాకీ జన్మలో ఈ కష్టాలు వచ్చి పడ్డాయి' అన్న జ్ఞానం వల్ల ఆ కష్టాలని అనుభవించేప్పుడు సహనంగా భరించే శక్తిని తమకి ఇవ్వమని మాత్రమే దేవుడ్ని ప్రార్థిస్తారు తప్ప తమ కష్టాలని తొలగించమని ప్రార్థించరు. సామాన్యులు మొక్కులు మొక్కడం, వ్రతాలు, తీర్థ యాత్రలు చేయడం లాంటివి చేస్తారు.

## 98. అభిమాన రచయిత

ఓ సాయంత్రం ఓ యువతి ఓ పుస్తకాల షాపుకి వెళ్ళి ఓ కొత్త రచయిత రాసిన పుస్తకాన్ని కొన్నది. మంచి పుస్తకాన్ని చదవ్వచ్చున్న ఆశతో ఆమె త్వరగా ఇంటికి చేరుకుంది. సౌకర్యంగా వున్న ఓ కుర్చీలో కూర్చుని, వేడి వేడి టీని తాగుతూ ఆమె ఆ వర్షపు సాయంత్రం ఆ పుస్తకాన్ని తెరిచింది. మొదటి పది పేజీలు చదివాక ఆమెకి ఆ నవల విసుగనిపించింది. దాన్ని మూసేసి పుస్తకాల షెల్ఫ్‌లో ఉంచి ఇక ఆ నవల గురించి ఆమె మర్చిపోయింది.

త్వరలోనే ఆమెకి ఓ యువ జర్నలిస్ట్‌తో పరిచయం అయి, క్రమంగా అది ప్రేమలోకి దారి తీసింది. ఓ ఆదివారం మధ్యాహ్నం ఆ జర్నలిస్ట్ ఆమె

ఇంటికి వచ్చాడు. అతను రాబోయే ముందు ఇల్లు సర్దిన ఆమెకి కొన్ని నెలల క్రితం తను కొన్న ఆ కొత్త రచయిత పుస్తకం కనిపించింది.

"చూసావా శ్రీనివాస్! ఈ నవలా రచయిత పేరు కూడా నీ పేరే. తమాషాగా లేదు?" అతనొచ్చాక దాన్ని చూపించి చెప్పిందతనితో.

"లేదు. ఎందుకంటే ఆ పుస్తకాన్ని రాసింది నేనే." చెప్పాడు శ్రీనివాస్.

అతనెళ్ళాక ఆ రాత్రి ఆ యువతి ఆ నవలని తిరిగి చదవడం ప్రారంభించింది. ఈ సారి ఆ నవల ఆమెకి విసుగు అనిపించకపోగా బాగా నచ్చింది. శ్రీనివాస్ ఆమె అభిమాన రచయిత అయ్యాడు.

కారణం?

ఆ నవలా రచయితతో ఆమె ప్రేమలో పడింది. ఇదే విధంగా నిన్న భగవద్గీతని చదివి అది విసుగు అనిపించినవారు దాని రచయితతో ప్రేమలో పడితే నేడు అది వారికి ఎంతో నచ్చుతుంది.

## 99. చొక్కా

ఓ ఊళ్ళోని ఓ ఐశ్వర్యవంతుడి దగ్గర అతని జీవిత కాలంలో అతను ఖర్చు చేయలేనంత డబ్బుంది. అతని జిల్లాలో అతనికి ఉన్నంత భూమి మరెవరికీ లేదు. అతని సేవకులు అతని మాటని వింటారు. అతని కుటుంబ సభ్యులు అతన్ని ప్రేమిస్తారు. ఐనా ఆరోగ్యంగా ఉన్నా తనకి ఆనందం లేదని గుర్తించాడతను.

తన ఊరికి వచ్చిన ఓ ఆధ్యాత్మిక గురువు దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"సరైన ఆనందం పొందడం ఎలా స్వామి?"

ఆయన చిన్నగా నవ్వి బదులు చెప్పాడు.

"మీ జిల్లాలో బాగా అనందంగా ఉన్న వ్యక్తి చొక్కాని నువ్వు ఓ రోజు ధరిస్తే నీకు అసలైన ఆనందం కలుగుతుంది."

అలాంటి వ్యక్తి ఒకతను తమ పొరుగూరులో ఉన్నాడని తెలుసుకుని అతని చిరునామాని పట్టుకుని అతని దగ్గరకి వెళ్ళాడు. చూడగానే అతని మొహంలో పరమ శాంతి కనిపించింది.